రహదారులపై స్క్రాప్ ఇక్కట్లు


ఏస్వీకో ఆపరేటివ్ సొసైటీలో రోడ్లపై ఆరబోసిన ప్లాస్టిక్ కవర్లు

జీడిమెట్ల: స్క్రాప్ గోదాముల నిర్వాహకులు రోడ్లపై ప్లాస్టిక్ కవర్లను ఆరబోసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగజేస్తున్నారు. ఎస్వీకోఆపరేటివ్ సొసైటీలో కొంతమంది స్క్రాప్ గోదాములు నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారు నిర్వహించే గోదాముల ముందు ఉన్న రోడ్లపై ప్లాస్టిక్ కవర్లను ఆరబోస్తున్నారు. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. గోదాముల నిర్వాహకులు రోడ్లపై ప్లాస్టిక్ కవర్లను ఆరబోయడం, డంప్ చేయడం లాంటి పనులను చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు


హిమబిందు

జగద్గిరిగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నాయని కాంగ్రెస్ సేవాదళ్ జగద్గిరిగుట్ట డివిజన్ ఉపాధ్యక్షురాలు బుర్ర హిమబిందు అన్నారు. ఆదివారం జగద్గిరిగుట్టలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, సేవాదళ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇటీవల తనను ఉపాధ్యక్షురాలిగా నియమించిన రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌కు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఆల్ స్పార్క్స్ స్పోర్ట్స్ ఫెస్ట్


విజ్ఞాన్ ఉషోదయ ఆల్ స్పార్క్స్ స్పోర్ట్స్ ఫెస్ట్ ముగింపు వేడుకలో పాల్గొన్న అనూప జైస్వాల్, చలపతి తదితరులు

సుభాష్‌నగర్: గాజుల రామారం విజ్ఞాన్ ఉషోదయ స్కూల్‌లో ఆదివారం 'ఆల్ స్పార్క్స్ స్పోర్ట్స్ ఫెస్ట్- 2024 ఘనంగా ముగిసింది. ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్ అంశాలపై పోటీలు నిర్వహించగా విజేతలుగా నిలిచినవారికి ముఖ్యఅతిథి అనూప్ జైస్వాల్, గౌరవ అతిథి చలపతి సర్టిఫికెట్లు, మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇప్పుడే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యపడుతుందన్నారు. ఈ స్పోర్ట్స్ ఫెస్ట్‌లో కుత్బుల్లాపూర్ మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు, పీఈటీలు పాల్గొన్నారు.

బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు


బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో పాల్గొని సర్టిఫికెట్‌లు అందుకున్న నియుధ లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు

మూసాపేట: భరత్‌నగర్‌లోని విజన్ టాలెంట్ స్కూలులో ఆదివారం కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. నియుధ లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమికి చెందినపలువురువిద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి రుద్రమాదేవి, డిఫెన్స్ అకాడమీ ప్రెసిడెంట్ రవి పాల్గొని విద్యార్థులకు బెల్టులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటే ఆత్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ తప్పక నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: గాజులరామారం డివిజన్ పరిధిలోని శ్రీమాతా యోగ అన్నపూర్ణేశ్వరి దేవాలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కార్పొరేటర్ రావుల శేషగిరి, కాంగ్రెస్ నాయకుడు మల్లేష్ గౌడ్, ఆలయ కమిటీ ప్రతినిధులు పూజల్లో పాల్గొన్నారు.

ఎదురుగా... బెదురుగా..!

- బాచుపల్లి చౌరస్తాసహా పలు కూడళ్లల్లో అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలు
- రాంగ్‌రూట్‌లో తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు




అంబేడ్కర్ చౌరస్తాలో ఒకవైపు రెడ్ సిగ్నల్.. మరో వైపు రాంగ్‌రూట్‌లో ద్విచక్ర వాహనదారుడు

నిజాంపేట్: ప్రధానకూడళ్లల్లో రాంగ్‌రూట్ జర్నీ డేంజర్‌గా మారింది. వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.. బాచుపల్లి నుంచి గండిమైసమ్మకు వెళ్లే రహదారి ప్రతినిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ విద్యాసంస్థల బస్సులు, ఉద్యోగాలకు వెళ్లే వాహనదారులు, ఆటోలతో రద్దీగా ఉంటుంది. ఇదే క్రమంలో కొందరు ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్నారు. ఒక్కసారిగా వాహనాలు ఎదురుగా రావడంతో ఇతర వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ముఖ్యంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి చౌరస్తా, ప్రగతినగర్ కమాన్ సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్, నిజాంపేట్ వాటర్ ట్యాంక్, సాయినగర్ చౌరస్తాల వద్ద ఈ పరిస్థితి నెలకొంది. ప్రధాన చౌరస్తాలో రద్దీ తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన ట్రాఫిక్ పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ముఖ్యంగా రద్దీ సమయాల్లో సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ సిబ్బంది కనిపించడం లేదు.

యూటర్న్‌ల వద్దప్రమాదాలు

బాచుపల్లి చౌరస్తా నుంచి వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాల మార్గంలో కొన్ని చోట్ల యూటర్న్‌లు ఉన్నాయి. అయితే కొంతమంది ద్విచక్ర వాహనదారులు తొందరగా వెళ్లాలనే అత్రుతతో రోడ్డుకు మరోవైపు వెళ్లే క్రమంలో రాంగ్‌రూట్‌ను ఎంచుకుంటున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనదారుల మధ్య వాగ్వాదాలు జరుగుతున్నాయి. ఇక రాత్రి సమయాల్లో టిప్పర్‌లు, ట్రాక్టర్లు, కార్లు సైతం రాంగ్ రూట్లో వస్తున్నాయి.

స్పెషల్ డ్రైవ్ అవసరం

రాంగ్ రూట్లో ప్రయాణించే వాహనదారులకు చలాన్‌లు విధిస్తే చాలావరకు కట్టడి చేయవచ్చని పలువురు సూచిస్తున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రాంగ్‌రూట్ వాహనదారులను గుర్తించి చలాన్‌లు విధించాలని, ఆ దిశగా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆటోమెటిక్ చలాన్‌లు విధిస్తున్నాం..



కొన్ని ప్రధాన చౌరస్తాలో అమర్చిన సీసీ కెమెరాల్లో రాంగ్‌రూట్ వాహనదారులను గుర్తిస్తున్నాం. వారికి ఆటోమేటిక్‌గా చలానా పడుతుంది. ఇంకా అవసరమైన చౌరస్తాల్లో ఏర్పాటు చేస్తాం. నిజాంపేట్ హనుమాన్ టెంపుల్ దగ్గర ఉన్న చౌరస్తాలో ప్రతిరోజూ సుమారు 800 చలానాలు రికార్డు చేస్తుంది.

ట్రాఫిక్ సీఐ ప్రశాంత్, మియాపూర్

బీజేపీ బూత్ స్థాయి అధ్యక్షుల నియామకం


బూత్‌స్థాయి అధ్యక్షులను సత్కరిస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: బీజేపీ సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బూత్ లెవెల్ అధ్యక్షులను నియమించారు. సూరారం డివిజన్ నెహ్రూనగర్‌లోని సాధన స్కూల్ 269 బూత్ అధ్యక్షుడిగా దిలీప్‌రెడ్డిని, 267 బూత్ అధ్యక్షుడిగా సాయిముదిరాజ్‌లను నియమిస్తూ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బక్క శంకర్‌రెడ్డి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి కేంద్ర ప్రభుత్వం పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని, స్థానికంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కేశవ్‌యాదవ్, జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ దీపక్, డివిజన్ అధ్యక్షుడు దుర్యోధనరావు తదితరులు పాల్గొన్నారు.

వీరనారి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం

- దుండిగల్‌లో ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వివేకానంద్


చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్: పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. దుండిగల్‌లో నూతనంగా నిర్మించిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ వీరోచితంగా పోరాడిందని కొనియాడారు. తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమానికి స్ఫూర్తిని నిలిచిన చాకలి ఐలమ్మ ఆశయ సాధనను అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, జక్కుల కృష్ణ యాదవ్, గోపాల్ రెడ్డి, విజయ శ్రీనివాస్ యాదవ్, ఆనంద్ కుమార్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ అడ్వకేట్ విజయ గోపాల్ రావు, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్ యాదవ్, జీహెచ్ఎంసీ డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్ , పుప్పాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నష్టపరిహారం..

రంగారెడ్డి నగర్ డివిజన్ వెంకటరామిరెడ్డి నగర్ కు చెందిన మహమ్మద్ అబ్దుల్ బాసిత్ 2021 నవంబర్ 14న ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఎమ్మెల్యే వివేకానంద్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు విద్యుత్ శాఖ మంజూరు చేసిన ఐదు లక్షల రూపాయల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వీసీ వేమారెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు ఆసిఫా భాను, ఎండీ అబ్దుల్ అజీజ్, ఎండీ అబ్దుల్ అర్ఫాత్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న శంభీపూర్ కృష్ణ

దుండిగల్: సీఎం రిలీఫ్ ఫండ్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంజూరు చేయించిన రూ. 6.28 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ సంబంధిత 18 చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, నిజాంపేట్ మునిసిపల్ యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్ గౌడ్, నాయకులు మేడి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

దుండిగల్ మున్సిపాలిటీ చర్చి గాగిల్లాపూర్‌లోని చైతన్య కాలనీ హార్మోన్ పెంతుకొస్తూ చర్చి పార్క్ సెంట్రల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అమరం గోపాల్ రెడ్డి, నేతలు సుధాకర్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు రంజిత్ రెడ్డి, పాస్టర్ వి.ఎస్ రావు, సతీష్ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి కృషి చేయాలి


అన్నం, వస్త్రదానం చేసిన జయంతి అన్నపూర్ణ, లక్ష్మీ నారాయణ దంపతులు

మోతీనగర్: ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంతైనా వెచ్చించి తమ వంతుగా సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలని ఎంసీహెచ్ఎస్ మాజీ అధ్యక్షుడు బీజముల్ల నాగేశ్వరరావు, నలమాల్పు అంజిరెడ్డి అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట డివిజన్ మోతీనగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ సభ్యులు జయంతి అన్నపూర్ణ, లక్ష్మీ నారాయణ దంపతులు నిరుపేదలకు వస్త్ర, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ఎంతోమంది ఆకలితో అలమటిస్తున్నారని అలాంటి వారికి ఒకపూట భోజనం పెట్టినా పుణ్యం కలుగుతుందని అన్నారు. సీనియర్ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాలు, అన్నదానంతోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో శేషగిరిరావు, కొల్లప్ప, రాజు, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దోమల నివారణకు చర్యలు


వెన్నెలగడ్డ ఎన్నాచెరువు వద్ద దోమల మందు పిచికారి చేసేందుకు డ్రోన్‌ను వాడుతున్న సిబ్బంది

కుత్బుల్లాపూర్: దోమలు వృద్ధి చెంది సమీప కాలనీవాసులను ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ ఎన్నా చెరువులో డ్రోన్ సహాయంతో మందులను పిచికారి చేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎంటమాలజీ అధికారి ఉమారాణి ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చెరువులో పెరిగిన గుర్రపు డెక్కపై దోమల నివారణ మందు చల్లారు. చెరువు చుట్టుపక్కల ఉండే ప్రజలు దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా స్పందించిన అధికారులు తక్షణ చర్యలు తీసుకున్నారు.

'ప్రతీ సమస్యను వెంటనే పరిష్కరిస్తా..'


పాపిరెడ్డినగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించిన సిబ్బందితో చంద్రారెడ్డి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీలోని ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరిస్తానని మాజీ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. బస్తీలోని రోడ్డు నెంబర్ 9 బ్లాక్ సిలో భూగర్భ డ్రైనేజీ రోడ్లపై మురుగు పారుతున్న సమస్యను చంద్రారెడ్డి దృష్టికి బస్తీవాసులు తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం జీహెచ్‌యంసి సిబ్బంది చేపట్టిన పనులను ఆయన దగ్గరుండి పరిశీలించారు. బస్తీలో ప్రతి సమస్యను పరిష్కరించి ఆదర్శవంతమైన బస్తీగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తానని హామీనిచ్చారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు సహకరిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులకు, సిబ్బందికి, బస్తీ వాసుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్. భగవంత్ రెడ్డి, నరసింహులు, చంద్రయ్య, రాజు, గోపాల్, కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవంతినగర్ ముఖద్వారానికి భూమిపూజ

మోతీనగర్: కాలనీ ముఖద్వారం ఏర్పాటు చేయటం ద్వారా చిరునామాలు సులభంగా గుర్తు పట్టవచ్చని అవంతినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ అవంతినగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ.2 లక్షలతో కాలనీ ముఖద్వార నిర్మాణానికి ఆయన శంకుస్థాపన, భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీకి ముఖద్వారం ఏర్పాటు చేయటం వల్ల చిరునామాలు సులభంగా లభిస్తాయన్నారు. జనవరి 26 నాటికి దానిని పూర్తి చేసి ప్రారంభించడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి బొజ్జ బాల రంగప్ప, కోశాధికారి అర్జున్, ఉపాధ్యాయులు రాంరెడ్డి, ప్రతాప్ సభ్యులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై అధికారులు స్పందించాలి


కూన శ్రీశైలంగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్‌లోని నివాసంలో శ్రీశైలంగౌడ్‌కు వివిధ కాలనీలు, బస్తీల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్పలో తాగునీటి సమస్య, పలు డివిజన్లలో డ్రైనేజీ లైన్‌లు వేసి రోడ్లు వేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా పలువురు శుభకార్యాలకు రావాల్సిందిగా కోరుతూ శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

దొంతిరి కార్తీక్‌రెడ్డికి నివాళి


దొంతిరి కార్తీక్‌రెడ్డి తల్లిదండ్రులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ చురుకైన యువ కార్యకర్తను కోల్పోయిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. బీఆర్ఎస్ యువనేత దొంతిరి కార్తీక్‌రెడ్డి దశదినకర్మ ఆదివారం కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, సురేష్‌రెడ్డి కౌన్సిలర్లు, వివిధ పార్టీ నేతలు, యువకులు పెద్ద ఎత్తున హాజరై ఘనంగా నివాళి అర్పించారు. కార్తీక్‌రెడ్డి తల్లిదండ్రులు దొంతిరి నరసింహారెడ్డి, నీరజ దంపతులను ఎమ్మెల్యే ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం పేదలకు దుప్పట్లు, దుస్తుల పంపిణీతో పాటు అన్నదానం చేశారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ కార్తీక్ రెడ్డి జ్ఞాపకార్థం ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.


దొంతిరి కార్తీక్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

రోడ్డును ఆక్రమించిన నేతలపై చర్యలు తీసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


తవ్విన రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

దుండిగల్: బీఆర్ఎస్ నేతలు ఆక్రమించిన రోడ్డును వెంటనే పునరుద్ధరించి, వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బౌరంపేట గ్రామంలో ఆక్రమణకు గురైన రోడ్డు పనులను గ్రామస్తులు, రైతులతో కలిసి ఆయన అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గండిమైసమ్మ నుంచి డీఆర్‌కె ఇంజనీరింగ్ కళాశాల, బౌరంపేట గ్రామం వరకు 2007లో రూ. 70 లక్షలతో మండల పరిషత్ నిధుల ద్వారా రహదారి వేశారని, 2009లో ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ హయాంలో ఇదే రహదారి దెబ్బతినడంతో రూ. 40లక్షలతో బీటీ రోడ్డు వేయించారన్నారు. ఇప్పుడు బిఆర్ఎస్ నాయకులు చౌదరిగారి మహిపాల్ రెడ్డి, రాంరెడ్డిలు కలిసి 100 ఫీట్ల రహదారి తవ్వించి ఆక్రమించారని గ్రామస్తులు శ్రీశైలం గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి బౌరంపేట గ్రామంలో పర్యటించి రహదారిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను శ్రీశైలం గౌడ్ ఆదేశించారు. శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి రోడ్డు రవాణా జరుగుతున్నందున ఈ రహదారిని చాలా మంది ప్రజలు ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ రహదారిపై స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలు, పాఠశాల విద్యార్థులు, రైతులు రవాణా కోసం ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. రహదారిని ఆక్రమించినవారిపై కఠిన చర్యలు తీసుకుని రహదారిని కాపాడాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, బొంగునూరి కిషోర్ రెడ్డి, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోళ్లకు మరమ్మతు



సాక్షి ఎఫెక్ట్..

రంగారెడ్డినగర్: వరదనీరు సాఫీగా వెళ్లేందుకు ఏర్పాటు చేసిన డ్రెయిన్ మ్యాన్‌హోళ్లు ధ్వంసమైన విషయమై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. చింతల్ మార్కెట్ రోడ్డులో సంవత్సరం క్రితం రోడ్డుపై నిలిచే వరదనీరు సాఫీగా వెళ్లేందుకు జీహెచ్ఎంసీ నిధులతో అండర్‌గ్రౌండ్ డ్రెయిన్ పైపులైన్‌ను కల్వర్ట్ బ్రిడ్జి వరకు నిర్మించారు. అయితే డ్రెయిన్ మ్యాన్‌హోళ్లపై ఏర్పాటు చేసిన మూతలు నాసిరకంగా ఉండటంతో వాహనాల రాకపోకలతో కొద్ది రోజులకే ధ్వంసమయ్యాయి. వాహనదారులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో 'ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ మూతలు'అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టి కొత్త మూతలను ఏర్పాటు చేశారు. అయితే పనులు చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్ మ్యాన్‌హోళ్ల వద్ద కాంక్రీట్ వ్యర్థాలను అలాగే వదిలేయడంతో రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. కాంక్రీట్ వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చింతల్ మార్కెట్‌లో మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టి మూత ఏర్పాటు చేసిన దృశ్యం